ప్రజాశక్తి
ఆదివారం 6 ఆగస్టు 2023 5
శ్రీ సత్యసాయి





నిరసన దీక్షలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు



పేరూరు ఎత్తిపోతలు ఇప్పట్లో లేనట్లే ..?

భూసేకరణ దగ్గరే ఆగిన పనులు

భూసేకరణ పూర్తవ్వాలంటే రూ.50.73 కోట్లు అవసరం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా రెండో దశ కిందనున్న పేరూరు ఎత్తిపోతల పథకం పనులు గడిచిన మూడేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. 2019లో వైసిపి అధికారంలోకి వస్తూనే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ చెన్నేకొత్తపల్లి మండలంలో జరిగిన శంకస్థాపన కార్యక్రమంలో ప్రకటించారు. కాని అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు మాత్రం ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

రివర్సు టెండరింగులో మూడు రిజర్వాయర్లు పెంచినా ...

పేరూరు ఎత్తిపోతల పథకం ద్వారా జీడిపల్లి నుంచి పేరూరు డ్యామ్‌కు నీటిని అందించే పనులను తెలుగుదేశం ప్రభుత్వ హయంలో రూ.803.967 కోట్లతో చేపట్టారు. రూ.113.33 కోట్లు అప్పటికే వెచ్చించారు. అయితే ఈ పనుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వైసిపి అధికారంలోకి వచ్చాక రివర్సు టెండరుకు వెళ్లాలని కొంతకాలం పనులను ఆపింది. ఆ తరువాత రివర్సు టెండరింగు కాకుండా పథకంలో మార్పులు చేసింది. సోమరవాండ్లపల్లి, తోపుదుర్తి, ముట్టాల, దేవరకొండ జలాశయాలను నిర్మించి లక్ష ఎకరాలకు నీటిని అందివ్వాలని నిర్ణయిస్తూ కొత్త ఉత్తర్వులిచ్చింది. అదే మొత్తంతో మరో మూడు కొత్త రిజర్వాయర్లు చేపడుతున్నామని ప్రకటించడమే కాకుండా ఈ నాలుగేళ్ల కాలంలో పూర్తి చేస్తామని చెన్నేకొత్తపల్లి సభలో ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కాని ఇప్పటికీ పనుల్లో ఎక్కడా పురోగతి కనిపించడం లేదు.

భూసేకరణకు వెలువడని నిధులు

భైరవానితిప్ప ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇటీవల నిధులను విడుదల చేశారు.ఈ మేరకు ఆ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందింది. కాని పేరూరు ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. ఈ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 988.66 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. ఆనాటి అంచనాల ప్రకారమే రూ.55.922 కోట్లు నిధులు అవసరమవుతాయి. అయితే ఇప్పటి వరకు చూస్తే 95.16 ఎకరాలు మాత్రమే భూసేకరణ జరిగింది. ఇంకా 893.50 ఎకరాలు భూసేకరణ జరగాల్సి ఉంది. రూ.50.73 కోట్లు నిధులు దీనికి అవసరమవుతాయి.

మరో మూడేళ్లు సమయం అవసరమంటున్న అధికారపార్టీ నేతలు

ఈ ప్రాజెక్టును ఈ నాలుగేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఇప్పుడు సాధ్యం కాదని అంటున్నారు. నిధుల లేమితో ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోందన్నారు. పేరూరు ఎత్తిపోతల పథకాన్ని మరో మూడేళ్లలో పూర్తి చేసే అవకాశముందని శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దీన్ని బట్టి పేరూరు ఎత్తిపోతల పథకం పనులు ఇప్పట్లో పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదన్నది స్పష్టమవుతోంది.

స్పందించకపోతే 19 నుంచి నిరవధిక సమ్మె

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ఐదో రోజుకు ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల దీక్షలు

సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఉషశ్రీచరణ్‌కు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు హెచ్చరించారు. బకాయి వేతనాలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హాజరయ్యారు. జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషాశ్రీచరణ్ కలెక్టరేట్‌లో సమావేశానికి హాజరైన సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని విన్నవించేందుకు కలెక్టరేట్ వద్దకు వెళ్లారు. పోలీసులు కలెక్టరేట్‌లో మంత్రులు సమావేశంలో ఉన్నారని చెప్పడంతో గేటు ముందు బైటాయించి నిరసన తెలిపారు. మంత్రి కలిసేందుకు అనుమతించాలని నాయకులు డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా అనుమతించాలని వారు ఆదేశించడంతో పోలీసులు లోపలికి అనుమతించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్‌ను నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతరం జిల్లాలో శ్రీ సత్య సాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో 557 మంది కార్మికులు 2000 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం తక్కువ గౌరవేతరం ఇస్తూ పని చేయిస్తోందన్నారు. ఇచ్చే అరకొర గౌరవ వేతనం కూడా నెలలు తరబడి బకాయి పెట్టారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సమయంలో కార్మికులు నిరసన సమ్మెలు చేపట్టారన్నారు. తమ సమస్యలు సీఎంకు వివరిస్తే సమస్య పరిష్కారం లభిస్తుందని ఆశించామన్నారు. అయితే జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి స్పందించి నాలుగు రోజుల్లోగా బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని రూ. 32 కోట్లు నిధులు మంజూరు కానున్నాయని హామీ ఇచ్చి సమ్మె విరమింపజేశారని గుర్తు చేశారు. అయితే ఇది జరిగి 20 రోజులు గడిచిన కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం నుంచి బిల్లు సంబంధిత ఫైనాన్స్ సెక్రటరీ దగ్గర ఆగినట్లు తెలిసిందన్నారు. స్పందించి రూ. 32 కోట్లు విడుదల చేసి కార్మికులకు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఈ నెల 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో వెళుతున్నట్టు మంత్రికి నాయకులు వివరించారు. స్పందించిన మంత్రి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు దీక్ష శిబిరంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే మార్గమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తోందన్నారు. అదాని అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. భవిష్యత్తులో చట్టాలను మార్చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం చర్యలను వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు మోడీకి మోకరిల్లుతుండడం శోచనీయంగా ఉందన్నారు. ఇలాంటి ప్రభుత్వాలను ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు నాగరాజు, లక్ష్మిరెడ్డి, ఎం.నాగరాజు, శ్రీనివాసులు, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనకు చంద్రబాబే కారణం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నిర్ధేశిత మార్గం మార్చడంతోనే ఉద్రిక్తత

ప్రణాళిక ప్రకారమే పోలీసులపై దాడి

విద్యుత్, అటవీ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పుంగనూరులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడానికి ప్రధాన కారణం టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడే అనివిద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. ముందుగానే ప్రణాళిక ప్రకారం తుపాకులు, రాళ్లు తెచ్చుకుని దాడులకు పాల్పడ్డారన్నారు. అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం అనంతపురం వచ్చారు. ఈసందర్భంగా రెవెన్యూ భవనంలో కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీ ఉనికిని కోల్పోయిందని విమర్శించారు. ఈ భయంతోనే చంద్రబాబునాయుడు ఉద్దేశ్యపూర్తకంగా ఘర్షణకు తెరలేపారని ఆరోపించారు. ముందురోజు చంద్రబాబు తీసుకున్న రోడ్డు మ్యాప్ ప్రకారం పుంగనూరు టౌన్‌లో పర్యటన లేదని చెప్పారు. కాని చివరి నిమిషంలో వెళ్లే ప్రయత్నం చేస్తుండగా భద్రతా కారణాల రిత్యా పోలీసులు ముందుకెళ్లవద్దని చెబితే వారిపై తుపాకులు, రాళ్లు, కర్రలు తెచ్చుకుని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అక్కడికీ పోలీసులు సంయమనంతో వ్యవహరించారన్నారు. ఈ దాడిలో అనేక మంది పోలీసులకు దెబ్బలు తగిలాయని చెప్పారు. ప్రజల పట్ల నమ్మకం సడలే చంద్రబాబు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆయన మెదడు కూడా మందగించిందని ఎద్దేవా చేశారు. రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ పనులు చేపడుతున్నది ఎన్‌సిసి సంస్థ అని చెప్పారని అది ఇంకా పనులే ప్రారంభించలేదని అన్నారు. అందులో డబ్బంతా తనకిచ్చారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నీచ రాజకీయాలు చేయడం చంద్రబాబుకు ముందు నుంచే అలవాటని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న అధికారులందరూ చేనేత దుస్తులు ధరించాలి

పుట్టపర్తి అర్బన్ : చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7న ఉద్యోగులందరూ చేనేత పట్టు వస్త్రాలు ధరించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర సాధనకు మొట్టమొదటి మెట్టు అయిన స్వదేశీ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన చేనేతకు గౌరవం ఇచ్చే విధంగా నిర్వహిస్తున్న చేనేత దినోత్సవం నాడు అందరూ తప్పనిసరిగా చేనేత దుస్తులు ధరించాలన్నారు. 1905లో స్వాతంత్ర సమరం తీవ్రంగా జరిగే రోజులలో ఆగస్టు 7న విదేశీ వస్తువులు బహిష్కరించాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఈ ఉద్యమం చేపట్టారన్నారు. అప్పటినుంచి భారతీయులు రాట్నంపై నేసిన దుస్తులను వేసుకోవడంతో విదేశీ వస్తువుల బహిష్కరణకు నాంది పలికారన్నారు. స్వాతంత్ర సమరంలో ప్రముఖ పాత్ర వహించిన విదేశీ దుస్తుల నిరాకరణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుని, ఆగస్టు 7న చేనేత దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఉద్యోగులు, మేధావులు, ప్రజలు అన్ని వర్గాల వారు 7 న చేనేత దుస్తులు ధరించాలని కోరారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతం చేద్దాం

జాయింట్ కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

అధికారులందరూ సమన్వయంతో పనిచేసిఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని జాయింట్ కలెక్టర్ టిఎస్. చేతన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వాతంత్ర్య వేడుకలపై డిఆర్ఒ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణుతో కలిసి అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకం ఎగురవేయాలన్నారు. అలాగే 15న పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జయరాం జెండాను ఎగురవేస్తారన్నారు. ఆహ్వాన పత్రికలను ప్రోటోకాల్ ప్రకారం ముందుగా పంపేందుకు, అలాగే ముఖ్య అతిథులుగా పాల్గొనే మంత్రి సందేశం రూపొందించేందుకు ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు డిపిఆర్ఒకు అందించాలన్నారు. పతాక ఆవిష్కరణ, సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, ప్రజలు కూర్చునేందుకు తగిన ఏర్పాట్లను సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, తహశీల్దార్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించుకోవాలని డీఈవోను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఆరోజు నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలన్నారు. నవరత్నాల్లో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు, విద్య, వైద్య, వ్యవసాయ రంగ అనుబంధ శాఖలు, గృహ నిర్మాణం, వెలుగు తదితర కార్యక్రమాలు ఆయా శాఖల అధికారులు రూపొందించుకోవాలన్నారు. ఉత్తమ అవార్డుల కోసం ఉద్యోగుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. ఈనెల 7న ఉత్తమ అవార్డుల ఎంపిక జాబితా సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రామాంజనేయులు, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చేతన్

రోడ్డు మీద రోడ్డు

ఇది అధికారుల, పాలకుల కనికట్టు

ప్రజాధనం హాంఫట్

నాడు జిఎస్‌బిసి రోడ్డు...నేడు సిసి రోడ్డు

ఎక్కడైనా కొత్తగా రోడ్డు వేస్తేనో, లేక మరమ్మతు చేస్తేనో అధికారులు బిల్లులు మంజూరు చేస్తారు. అయితే హిందూపురం మున్సిపాలిటీ అందుకు విరుద్ధంగా పనిచేస్తోంది. ఒకే రోడ్డుకు వివిధ పేర్లతో పలుమార్లు బిల్లులు చేసుకుంటున్నారు. పాలకుల ధనదాహానికి, గుత్తేదారులు స్వార్థ ప్రయోజనాలకు అధికారులు తమ వంతు వత్తాసు పలుకుతుండటంతో ఒకే రోడ్డుకు వివిధ రకాల పేర్లతో బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ పురపాలక సంఘంలో లేని విధంగా హిందూపురం పురపాలక సంఘంలో రోడ్డుపై కంకర వేస్తే జిఎస్‌బిసి రోడ్డు, మట్టి వేస్తే గ్రావెల్ రోడ్డు అంటు పురపాలక సంఘంలో సాధారణ నిధులతో పాటు ఆర్థిక సంఘం నిధులు మొదలుకుని తాజాగా వచ్చిన గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులను సైతం అధికారుల అండతో పాలకులు గుత్తేదారులకు దోచి పెడుతున్నారు. వేసిన రోడ్డుమీదే మరో రోడ్డు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు సామూహిక మరుగుదొడ్ల అనుమతులు మంజూరు నుంచి...నూతన మార్కెట్ వేలం వరకు అన్నింటా పాలకులు అవినీతికి పాల్పడినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినపిస్తున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పురపాలక సంఘ అభివృద్ధికోసం ప్రత్యేక నిధులు రాలేదు. వచ్చే ఆర్థిక సంఘ నిధులతో పాటు పురపాలక సంఘ సాధారణ నిధులతో ఎక్కడ లేని విధంగా జిఎస్‌బిసి రోడ్డు, గ్రావెల్ రోడ్ల పేరుతో గుత్తేదారులతో కలిసి పాలకులు అడ్డంగా దోచుకుంటున్నారు. దీనికి ఉదాహరణ 6వ వార్డు ధర్మపురంలోని నారాయణ కళాశాల ఎదురుగా ఉన్నా రోడ్డు. ఈ రోడ్డు గుంతలు పడ్డాయని దాని మరమ్మతుల కోసం రూ.2.30లక్షలతో గత సంవత్సరం నవంబర్ నెలలో కంకర వేసి జిఎస్‌బిసి రోడ్డు వేశారు. తిరిగి అదే రోడ్డును 7 నెలలు పూర్తి కాకుండానే గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.12లక్షలు వెచ్చిస్తు సిసి రోడ్డు వేయడానికి మళ్లీ కంకర వేశారు. గత ఏడాది తీవ్ర వర్షాల వల్ల పట్టణం చుట్టు పక్కల ఉన్నా చెరువులు అన్ని పొంగి పొర్లడంతో రాక పోకలు నిలిచి పోయాయి. దీంతో మడకశిర రహదారి నుంచి 38వ వార్డు సింగిరెడ్డి మీదుగా తాత్కలికంగా జిఎస్‌బిసి రోడ్డు పేరుతో సమీపంలో ఉన్న ఉక్కు పరిశ్రమలో నుంచి వ్యర్థాలను రోడ్డుపైకి వేసి లక్షలాది రూపాయాలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. పురపాలక సంఘానికి సంబంధించిన డంపింగ్ యార్డు రూరల్ మండలంలో ఉంది. డంపింగ్ యార్డులో గుంతలు తీయడానికి ఒక బిల్లు, తీసిన మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించడానికి ఒక బిల్లు, ఇదే మట్టిని 10వ వార్డు లక్ష్మీపురం, తదితర వార్డులో రోడ్డులో ఉన్నా చిన్న చిన్న గుంతలు మూయడానికి గ్రావెల్ రోడ్డు పేరుతో మరో బిల్లు చేసుకుని పాలకులు, అప్పటి అధికారులు, గుత్తేదారులు కలిసి అడ్డంగా దోచుకున్నట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. అప్పుడు కంకర వేసి జిఎస్‌బిసి పేరుతో వేసిన రోడ్లపై తాజాగా మరో సారి కంకర వేస్తు సిసి రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. మొదటే పురపాలక సంఘంలో నిధులు లేక అభివృద్ధి పనులు జరగడం కష్టంగా ఉన్న సమయంలో ఇక్కడ మాత్రం ఒకే రోడ్డుకు వివిధ పేర్లతో రెండు నుంచి మూడు సార్లు నిధులు వెచ్చించి పాలకులు గుత్తేదారులకు దోచిపెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు పాలకులు తమ స్వార్థం వీటి పురపాలక సంఘ నిధులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




నాడు జిఎస్‌బిసి రోడ్డు పేరుతో వేసిన కంకర (ఫైల్ ఫొటో)


అదే రోడ్డుపై నేడు సిసి రోడ్డుకు కోసం వేసిన కంకర

ప్రజాశక్తి
www.prajasakti.com



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ వీరనరేష్

మొక్కజొన్న, రాగి పంటల పరిశీలన

గుడిబండ : మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామంలో రైతు నాగేంద్రప్ప పొలంలో సాగుచేసిన మొక్కజొన్న, రాగి పంటలను శనివారం ఎఒ వీరనరేష్ పరిశీలించారు. మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు వ్యాధిని గుర్తించి నివారణ మందులను రైతుకు వివరించారు. అలాగే రాగి పంటలో అగ్గితెగులు, మెడ విరుపు వ్యాధి నివారణకు మందులను సూచించారు. వారి వెంట ఆర్‌బికె అధికారి నరేష్, రైతు నాగేంద్రప్ప, జడ్పి ఎన్‌ఎఫ్ స్టాఫ్ ఉన్నారు.

పోస్టర్లు విడుదల

రొద్దం : ఈ నెల 10వ తేదీ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో డాక్టర్ జగదీష్ బాబు, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎంపిహెచ్‌ఒ శ్రీనివాసులు, ఎఇఒ జయభాస్కర్, సిడిపిఒ శాంతలక్ష్మి ఆధ్వర్యంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జగదీష్‌బాబు మాట్లాడు తూ నులిపురుగుల మాత్రలు వాడడం వల్ల పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు సుజాత, అనురాధ, కార్యకర్తలు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి నివాళి

ముదిగుబ్బ : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఉపాధ్యాయుడు పోతులయ్యకు శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల భవనంలో తోటి ఉపాధ్యాయులు సంతాప సభ నిర్వహించారు. ఆయనతో ఉన్న పరిచయాలు, మధుర జ్ఞాపకాలు, అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ రమణప్ప, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కార్యకర్తకు 'కందికుంట' పరామర్శ

కదిరి టౌన్ : చంద్రబాబు కదిరి పర్యటనలో రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ సున్నపుగుట్ట తండాకు చెందిన టిడిపి కార్యకర్త కె.రమణనాయక్ ప్రమాదవశాత్తూ గాయపడి కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కందికుంట ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి రూ. 10 వేలు అందజేశారు. ఆయన వెంట రూరల్ మండల నాయకులు ఉన్నారు.

కొత్తచెరువులో తాగునీటి సమస్య పరిష్కారం

కొత్తచెరువు : కొత్తచెరువులో తాగునీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి సంత మార్కెట్‌లో మేజర్ పంచాయతీ సర్పంచి రాధానాగరాజు పంచాయితీ నిధులతో వేయించిన నూతన బోరులో మూడు ఇంచుల నీరు పడింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరుతుందని వారు తెలిపారు. ఉన్న బోరులో 20 రోజులుగా నీరు తగ్గిపోవడంతో గ్రామంలో తాగునీటి సమస్య అధికమైంది. నూతన బోరులో నీరు పుష్కటంగా ఉండడంతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మరిన్ని బోర్లు వేసి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గోపాల్, వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, ఎల్లప్ప, వార్డు మెంబర్లు పాల్గొన్నారు

నేడు టిడిపి ఆధ్వర్యంలో జిల్లేడుబండ ప్రాజెక్టు సందర్శన

బుక్కపట్నం : మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామం వద్ద చేపడుతున్న జిల్లెడుబండ ప్రాజెక్టును ఆదివారం టిడిపి జిల్లా నాయకుల బృందం సందర్శించనున్నట్లు మండల కన్వీనర్ మల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు, జిల్లా నాయకులు డ్యాంను పరిశీలించి ముంపునకు గురవుతున్న రైతులతో మాట్లాడి, వారికి పరిహారం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తారని తెలిపారు. కావున టిడిపి నాయకులు, రైతులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మండల ప్రభుత్వ ఖాజీగా హయత్ ఖాన్

నల్లచెరువు : మండల ప్రభుత్వ ఖాజీగా పిఎండి హయత్ ఖాన్‌ను నియమించినట్లు శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం సంప్రదాయ వివాహాలు, ఇస్లాం మత వివాహ సమస్యలు, దహన సంస్కారాలు, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముస్లింలకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెచ్చి పరిష్కారం చేసుకోవచ్చు అని వివరించారు.

మంత్రుల దృష్టికి సమస్యలు

మడకశిర రూరల్ : ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి శనివారం అనంతపురం జిల్లాలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్‌లను కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేత హోదాలో ఇచ్చిన హామీ మేరకు జగన్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేశారని, అయితే కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు 23 ఏళ్లు పని చేసి మృతిచెందారని ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



మంత్రి పెద్దిరెడ్డికి బొకే అందజేస్తున్న కోదండరామిరెడ్డి

ఇస్లాపురం సింగిల్‌విండో అధ్యక్షులుగా సూర్యప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-పెనుకొండ

ఇస్లాపురం పరస్పర సహకార రైతు పరపతి సంఘం అధ్యక్షులుగా సూర్య ప్రకాష్ రెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని ఎడిసిసి బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై ఛైర్మన్‌గా సూర్య ప్రకాశ్ రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే శాలువా కప్పి గజమాల వేసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సొసైటీ అభివృద్ధి బాటలో ఉంటే రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్నారు. సూర్య ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సొసైటీని అభివృద్ధి బాటలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధ్యక్షులకు పూలమాలలు వేసి బొకేలు ఇచ్చి



సూర్యప్రకాష్‌రెడ్డిని అభినందిస్తున్నఎమ్మెల్యే శంకరనారాయణ

అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి గుట్టూరు శ్రీరాములు, ఎంపిపి గీతా రామ్మోహన్‌రెడ్డి, శీన, మండల కన్వీనర్ నంగులూరు బాబు, పట్టణ కన్వీనర్ బోయిన నరసింహా, శ్రీకాంత్‌రెడ్డి, పెనుకొండ నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సునీల్‌కుమార్, బాబు శ్రీనివాసులు, శ్రీరాములు, అభిషేక్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాబ్జిరెడ్డి, నరసింహారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, మారుతి, తయ్యూబ్, సద్దాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లేడుబండ భూనిర్వాసిత రైతులతో సమావేశం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని గుడ్డంపల్లి తండా సమీపంలో నిర్మిస్తున్న జిల్లేడుబండ ప్రాజెక్ట్ భూనిర్వాసిత రైతులతో శనివారం పరిటాల శ్రీరామ్ సమావశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం టిడిపి జిల్లా నాయకులు జిల్లేడుబండ ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. కావున ప్రాజెక్ట్ ముంపు గ్రామాల రైతులందరూ హాజరై మీ సమస్యలను వారి దృష్టికి తీసుకొస్తే, వారు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రమేష్‌బాబు, ప్రభాకర్‌నాయుడు,



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

తుమ్మల సూరి, శేఖర్, గోవిందు, గణపర్తి నారాయణస్వామి, మహబూబ్ పీరా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని నిడిమామిడి హైస్కూల్‌లో శనివారం ఎంఇఒ బొల్లె ప్రసాద్, హెచ్‌ఎం పద్మజ, గ్రీన్ భారత్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బి.వెంకటరత్నం ఆధ్వర్యంలో "మరో హరిత విప్లవం" అనే సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు గ్రీన్ భారత్ సహకారంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఏ గ్రామానికి ఎన్ని మొక్కలు కావాలో డేటా సేకరించి మండలంలో పచ్చదనం పెంచటమే మా కర్తవ్యమని పర్యావరణ ఉద్యమ సృష్టికర్త శంకరనారాయణ పేర్కొన్నారు. ఇంటింటికీ పాడి పరిశ్రమ, రైతును ప్రకతి వ్యవసాయం వైపు మళ్లించడమే గ్రీన్ భారత్ లక్ష్యమన్నారు.

జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో

పర్యావరణ పరిరక్షణ, దాని ఆవశ్యకతపై శనివారం మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేషన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్‌నాయుడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షుడు, నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్‌మెంట్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ జగరాజుపల్లి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్టా చట్టం, చెట్లు, అడవుల పరిరక్షణ, వాటి విశిష్టత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ బాబు, కెజిబివి ఎస్ఒ నాగసుప్రజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసుల అనుమతి లేనిదే పుట్టపర్తిలో ఎలాంటి రాజకీయ, బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఎస్పీ మాధవరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తిలో ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించకుండా ఆంక్షలు ఉన్నాయన్నారు. నిర్వహించాలనుకునేవారు సంబంధిత డిఎస్‌పి కార్యాలయంలో 48 గంటలు ముందుగానే అనుమతులు పొందాలని సూచించారు. ఈ నిబంధన ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు అమలులో ఉంటుందన్నారు. ఈ నిబంధన వివాహ వేడుకలు, అంత్యక్రియలకు వర్తించదని తెలిపారు. అనుమతి తీసుకోకుండా ఎవరైనా బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘనస్వాగతం

బత్తలపల్లి : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బత్తలపల్లిలో స్థానిక వైసిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి శనివా రం రోడ్డు మార్గంలో తిరుపతి నుంచి అనంతపురం వెళ్తుండగా ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి బత్తలపల్లి కూడలిలో కాన్వాయ్‌ని ఆపి మంత్రితో మాట్లాడారు. నాయకులు సైతం మంత్రికి శాలువా కప్పి పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, కోటి వీరనారప్ప, బండి నాగభూషణ, కమతం శంకర్, కుమ్మర వెంకటరమణ, ముసలప్ప, సాకే గోపాల్, ఈడిగ కృష్ణా, వెల్డింగ్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కదిరి వైసిపి నాయకులు వి.పవన్‌కుమార్‌రెడ్డి, మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, వాల్మీకి అధినేత అనిల్‌కుమార్‌రెడ్డి, మైనుద్దీన్, పార్టీ కౌన్సిలర్లు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



బత్తలపల్లిలో మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోటి

అనంతరం ఆయన అనంతపురం జిల్లాలో జరుగుతున్న కార్యక్రమానికి తరలివెళ్లారు.

క్రికెట్ జెర్సీ పోస్టర్ ఆవిష్కరణ

కదిరి టౌన్ : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంత పర్యటన నేపథ్యంలో వైసిపి నాయకులు డాక్టర్ వెంకటరమణ నల్లచెరువులో పార్టీ శ్రేణులతో కలిసి మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ జెర్సీని, పోస్టర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కొత్తచెరువు మండలం పరిధిలోని వంగంపల్లి గ్రామంలో గ్యాస్ లీకేజీ వల్ల మృతి చెందిన మహిళ కుటుంబాన్ని ఆదుకోవాలని శనివారం ఆ గ్రామస్తులు, సిపిఐ, మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ గ్యాస్ కంపెనీ ఆ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పౌర సరఫరాల శాఖ అధికారికి వినతి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న నాయకులు గ్రామస్తులు

పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటనారాయణ, రమణ, లక్ష్మీదేవి, భాను, లక్ష్మి, వంగంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక కెజిబివి స్కూల్ కాంపౌండ్ వద్ద ఉన్న డ్రైనేజీతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్కూల్ వద్ద డ్రైనేజీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అస్తవ్యస్త డ్రైనేజీ వల్ల విద్యార్థులు దుర్వాసన, దోమల బెడదతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే అధికారులు మురుగు కాలువలను శుభ్రం చేయించాలని కోరారు.



స్కూల్ వద్ద డ్రైనేజీ కాలువను చూపుతున్న సామకోటి



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థినులతో ఆర్‌డిటి సిబ్బంది

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గాండ్లపెంట

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ, ఎంఇఒ కృష్ణనాయక్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం గాండ్లపెంట, ఎన్‌పి కుంట మండలాల్లోని జడ్పి హైస్కూళ్లు, కెజిబివి బాలికలకు ఆర్‌డిటి ఆధ్వర్యంలో రూరల్ బాలికల అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా లాంగ్‌జంప్, రన్నింగ్ తదితర పోటీల్లో 80 మంది బాలికలు పాల్గొన్నారు. వారిలో 9 మంది ఈ నెల 29వ తేదీ జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఎటిఎం కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ, ఎంఇఒ కృష్ణనాయక్, ఎస్‌బిఐ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల చాలా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. అన్ని రంగాల్లో రాణించే విధంగా బాలికల ముందు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధురాంబ, ఎంఇఒ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్‌అలీ, పిఇటి రాయుడు, ఆర్‌డిటి ఎస్‌టిఎల్ రాంప్రసాద్‌రెడ్డి, సీసీలు లక్ష్మన్న, నవీన్, నాగమణి, సీత, బాలికలు, ఆర్‌డిటి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పివిఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఓటుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక పివిఎస్ పాఠశాలలో ఓటు విలువపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో విద్యార్థి నాయకుడిని ఎన్నుకునేందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికల ప్రక్రియ, నాయకుడి ఎన్నిక, ఓటు విలువ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ పివి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే ప్రజాస్వామ్యం పట్ల అవగాహన పెంచుకోవాలని, ఓటు విలువ తెలుసుకొని మంచి నాయకులు, ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో తమ వంతు పాత్రను పోషించి భావి బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని ఆకాంక్షించారు. మాక్ ఓటింగ్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

7న టిడిపి ఆధ్వర్యంలో రిజర్వాయర్ సందర్శన

ప్రజాశక్తి-రొళ్ల

మండల పరిధిలోని రత్నగిరి, కొల్లాపురి రిజర్వాయర్లను ఈ నెల 7వ తేదీ మడకశిర ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సారథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి నాయకులు సందర్శిస్తారని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం మండల టిడిపి నాయకులు బాజయ్య పాళ్యం గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా నాయకులు రిజర్వాయర్ స్థలాన్ని సందర్శించి, రత్నగిరి కొల్లాపురమ్మ, కాళికాదేవి ఆలయాలను సందర్శించి పూజలు చేస్తారు. మధ్యాహం రొళ్లలో పార్టీ కార్యా లయాన్ని, ప్రారంభిస్తారు. కావున రొళ్ల, అగలి మండలాల నాయకులు, కార్యకర్త లు, రైతులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దాసిరెడ్డి, క్రిష్టప్ప, పాండురంగప్ప, సిఎన్ మూర్తి, నాగరాజు, రమేష్, రామకృష్ణ, రామన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న జడ్పిటిసి కోటి సుధ

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను శనివారం జడ్పిటిసి కోటి సుధ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పిచ్చి మొక్కలు పెరిగి ఉండడంతో వాటిని శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో వృథాగా ఉన్న ఆర్ఒ ప్లాంట్‌ను పరిశీలించి ఇన్‌చార్జి హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చెప్పినా వినలేదు, ఎమ్మెల్యే కేతిరెడ్డి చెప్పినా వినడం లేదంటే మీరు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుందని మండిపడ్డారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి బాగా చదువుకోవాలని సూచించారు. అలాగే సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

పంపిణీకి నోచని పాఠ్య పుస్తకాలు

గోరంట్ల : పాఠశాలలు ప్రారంభమై 50 రోజులు కావస్తున్నా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాలు ఇంకా ఎమ్మార్సీ కార్యాలయంలోనే ఉన్నాయి. మొదటి విడతలో విద్యార్థులకు అరకొరగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంకా కొన్ని సబ్జెక్టులకు అందజేయలేదు. ఆ పుస్తకాలు ఎంఆర్‌సి కార్యాలయానికి చేరినా విద్యార్థులకు పంపిణీ చేయకపోవడం పట్ల విద్యార్థులు తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎంఆర్‌సికి వచ్చిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎంఆర్‌సి కార్యాలయంలో పాఠ్య పుస్తకాలు

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పరిగి

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యాధికారి డాక్టర్ స్వరూపారెడ్డి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఆధ్వర్యంలో శనివారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నులి పురుగుల కార్యక్రమం ఆవశ్యకత, ఆల్బెండజోల్ ఉపయోగాలను వివరించామన్నారు. ఎంపిడిఒ సరస్వతి, ఎంఈఓ, డిప్యూటీ తహశీల్దార్, రూబీ సురేష్ కుమార్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.



మందులను పంపిణీ చేస్తున్న అధికారులు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

27 ఏళ్ల క్రితం ఓ యువతిని హత్య చేసిన కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు బత్తలపల్లి మండల పరిధిలోని నల్లబోయినపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డిని శనివారం కర్నాటక పోలీసులు ధర్మవరం పోలీసులు కలిసి అరెస్టు చేశారు. వివరాలు.. 1996లో రాప్తాడు మండలంలోని బుక్కచెర్లకు చెందిన యువతి వీణాకుమారిని ప్రేమ వ్యవహారంలో కర్నాటకలో హత్య చేశారు. దీనిపై 1998లో ఐదుగురిపై కేసు నమోదైంది. ఈ కేసులో ఏ-2 ముద్దాయిగా ఉన్న వెంకటేశ్వర్‌రెడ్డి 27 ఏళ్లుగా కోర్టుకు హాజరుకాకుండా తిరుగుతుండటంతో కర్నాటక పోలీసులు నాన్ బెయిలబుల్ వారెంటుతో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులును కలిశారు. దీంతో ధర్మవరం పోలీసుల సహకారంతో నల్లబోయినపల్లిలో ఉన్న వెంకటేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అనంతరం చిక్కబళ్ళాపూర్ జిల్లా గుడిబండ పోలీసులకు వెంకటేశ్వరరెడ్డిని అప్పగించారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

చిలమత్తూరు : మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని పాతచామలపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రైతు వేణుగోపాల్ 2 ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగు చేయగా కంకి దశలో ఉంది. ఈ తోట అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో శుక్రవారం రాత్రి అడవి పందులు మొక్కజొన్న పంటను మొత్తం ధ్వంసం చేశాయి. దీంతో రైతు వేణుగోపాల్ రూ. 1.50 లక్షలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



అడవి పందులు ధ్వంసం చేసిన పంట



ఎర్రవంకవాండ్లపల్లి పాఠశాల, పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

పెచ్చులూడుతున్న ఎర్రవంకవాండ్లపల్లి పాఠశాల భవనం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మరికొమ్మదిన్నె పంచాయతీ పరిధిలోని ఎర్రవంకవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతుం డడంతో విద్యార్థులు భయాందోళనల మధ్య చదువులు సాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 27 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సిమెంట్ పెచ్చులు ఎక్కువగా ఊడి కింద పడుతున్నాయి. దీంతో విద్యార్థులకు చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. లేదా సెలవుగా ప్రకటిస్తున్నారు. దీనికి తోడు పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల పైకప్పు మరమ్మతులు చేయించడంతో పాటు ప్రహరీ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేని కలిసిన కన్నడ నటుడు శివరాజ్ కుమార్

పెనుకొండ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే శంకరనారాయణను కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివరాజ్ కుమార్‌కు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం వారు సినిమా షూటింగ్ గురించి కాసేపు ముచ్చటించారు. అలాగే పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శివరాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

మహిళల భద్రత కోసమే మినీబ్యాంకు సేవలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

గ్రామీణ ప్రాంత మహిళల భద్రత కోసమే ఎపిజిబి సహకారంతో మినీ బ్యాంక్ సేవలు ఏర్పాటు చేశామని ఎంపిపి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గసిగవారిపల్లి గ్రామంలో శనివారం ఆయన మినీ బ్యాంక్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజలు ఆర్థిక లావాదేవీల కోసం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సహకారంతో గ్రామంలోనే మినీ బ్యాంక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి గోవిందరెడ్డి, బ్యాంక్ మేనేజర్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-చిలమత్తూరు

పంచాయతీ పారిశుధ్య, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోడూరు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలపై సిఐటియు మండల అధ్యక్షులు రామచంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 20 వేలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు, తదితర సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ నాయకులు అశ్వర్థప్ప, మూర్తి, సుధామణి, అంజమ్మ పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

చిలమత్తూరు : స్థానిక మెర్జ్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ సింహాచలం, పిడి లక్ష్మీకుమార్ సందర్శించి గర్భిణులు, బాలింతలకు ఇచ్చే టేక్ హోం రేషన్ గురించి ఆరా తీశారు. అలాగే ఎడబ్ల్యూ మొబైల్‌లో టిహెచ్ఆర్, యాప్‌లో గర్భిణులు, బాలింతలు, 0-6 సంవత్సరాల పిల్లల రిజిస్ట్రేషన్, డిస్ట్రిబ్యూషన్ తదితర విషయాల గురించి వివరించారు. పెండింగ్ ఉన్న వారిని రిజిస్ట్రేషన్ చేసి వెంటనే అందజేయాలని యాప్‌లో సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్ లలితమ్మ, శారద పాల్గొన్నారు.

పట్టచీరల తయారీ వ్యాపారుల సంఘం అధ్యక్షులుగా గిర్రాజు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పట్టుచీరల తయారీ వ్యాపారుల సంఘం అధ్యక్షులుగా గిర్రాజు రవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం 340 మంది వ్యాపారులు సభ్యత్వం తీసుకున్న అనంతరం ఎన్నిక నిర్వహించారు. గిర్రాజు రవి, చింతా బాలకృష్ణ సంఘం అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. ఇందులో గిర్రాజు రవికి 169, బాలకృష్ణకు 148 ఓట్లు వచ్చాయి. దీంతో 21 ఓట్లతో రవి గెలుపొందారు. అనంతరం రవిని వ్యాపారులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



గిర్రాజు రవిని సన్మానిస్తున్న వ్యాపారులు

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, ఎల్లప్ప సూచించారు. స్థానిక బిసి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం లబ్ధిదారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కోడిగుడ్లు, పాలు, రాగి, జొన్న పిండి, బెల్లం, వేరుశనగ చిక్కీలు, తదితర వస్తువులు పంపిణీ చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి లాలూనాయక్, వైద్య సిబ్బంది రామలక్ష్మమ్మ, రేణుక, పరిమళ, అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి, మహిళా పోలీస్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల పరిధిలోని పిఎన్ పాలెం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ కిట్లను ముత్తుకూరు సర్పంచి జగదాంబ భర్త క్రిష్ణప్ప, నాయకులు రంగధామప్ప పంపిణీ చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు బాలామృతం కిట్లు, 3-6 ఏళ్ల లోపు పిల్లలకు ప్రీస్కూల్ ద్వారా పలక, బలపం, పెన్సిల్, తదితర వాటిని పంపిణీ చేస్తారన్నారు. నాణ్యమైన భోజనం కూడా అందిస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగరత్నమ్మ, హెల్పర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండల పరిధిలోని చీపులేటి అంగన్‌వాడీ సెంటర్ వద్ద కౌన్సిలర్ విక్రమ్ బాలింతలు, గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో చిన్నప్పరెడ్డి, అంగనవాడీ వర్కర్ సవిత, పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు అడ్డంకులు తొలగించండి

ముదిగుబ్బ : స్థానిక గేట్‌కొట్టాల ప్రాంతంలో ఇటీవల మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులను తొలగించి పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని శనివారం సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు, కె.బాబు ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎస్ఐ హేమంత్ కుమార్ లకు వినతిపత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో గేట్ కొట్టాల కాలనీ మహిళలు పాల్గొన్నారు.

13న రజకుల మహాసభ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలోనిసాయి ఆరామంలో ఈ నెల 13వ తేదీ చేపట్టనున్న రజకుల మహాసభను జయప్రదం చేయాలని ఏపీ రజక సంఘం ఉపాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి శీనప్ప కోరారు. మండల పరిధిలోని పెడపల్లి, కొట్లపల్లి గ్రామాల్లో శనివారం మహాసభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా రజకులు ఉన్నారని, వీరు ఆయా గ్రామాల్లో ఎన్నో సమస్యలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. కావున హక్కుల సాధన కోసం పోరాటం అవసరమని ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. రజకులను ఎస్సీ కేటగిరీలో చేర్చాలని, 50 ఏళ్లకే పింఛన్, ఇంటి పట్టా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్ చంద్ర, రవీంద్ర, చలపతి, శేఖర్, రాము, ఈశ్వరప్ప, కళావతి, మనోహర, రామచంద్ర, ఈశ్వరయ్య, వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : రజకుల సమస్యలపై ఈ నెల 13న పుట్టపర్తిలో జరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని పిల్లవంక కాలనీ వద్ద ఉన్న దోబీఘాట్‌లో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి బాపనపల్లి శ్రీనివాసులు జిల్లాకన్వీనర్, నారాయణప్ప నరసింహులు, నాయకులు నాగభూషణ, నాగేంద్రహనుమంత్, కేశవ, సుబ్రమణ్యం, నరసింహులు, నాగేష్, శీన, సుధాకర్, మాలతి పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్లలో జోష్

కదిరి అర్బన్ : టిడిపి అధినేత చంద్రబాబు పర్యటన నియోజకవర్గ తెలుగుతమ్ముళ్లలో జోష్ పెంచిందని చెప్పవచ్చు. పట్టణంలోని బహిరంగ సభలో చంద్రబాబు నోట కందికుంట మాట రావడం, గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉందని చెప్పడాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తు చేస్తున్నారు. అంబేద్కర్ కూడలిలో చంద్రబాబు సభకు హాజరైన జనాన్ని చూసి అధినేత సైతం ఆనందం వ్యక్తం చేశారని, కదిరిపై కందికుంట బ్రాండ్ కనిపించిందని పేర్కొంటున్నారు. 2024 ఎన్నికల టిడిపి అభ్యర్థి కందికుంటేనని ఖరారు చేసినట్లేనని నియోజకవర్గ టిడిపి నాయకులు చెప్పుకుంటున్నారు.

చంద్రబాబు కాన్వాయ్‌పై దాడిని ఖండిస్తూ టిడిపి నిరసనల వెల్లువ

ధర్మవరం టౌన్ : దాడులు చేస్తుంటే చూస్తు ఊరుకునే రోజులు పోయాయని, మీరు చేసే ప్రతిదానికి టిడిపి వైపు నుంచి ప్రతిచర్య ఉంటుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్ పర్యటనలకు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక వైసిపి దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతం కాటమయ్య, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, కాచర్ల కంచన్న, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, మేకల రామాంజనేయులు, నాగూర్ హుస్సేన్, అంబటి సనత్ పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి పిరికిపందల చర్య అని మడకశిర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పే స్వామి పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ శనివారం పట్టణంలోని బాలాజీనగర్‌లో తిప్పేస్వామి, టిడిపి శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపేందుకు బయల్దేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు స్థానిక టిడిపి కార్యాలయం వద్ద బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గుండమల మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. చంద్రబాబుకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పైశాచిక చర్యలకు పాల్పడుతున్నారని, హోం మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 9 నెలల్లో వైసిపి అడ్రస్ ఉండదని, పోలీసులు వ్యవహారశైలి మార్చుకోవాలని, లేనిచో ఇబ్బంది పడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, పట్టణ మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, కల్లుమరి సర్పంచి నాగరాజు, డాక్టర్ కృష్ణమూర్తి, తిమ్మరాజు, కాంతరాజు, రవి, రామకృష్ణ, పాల్గొన్నారు.



పుట్టపర్తిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గోరంట్ల : దాడికి నిరసనగా పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేయడానికి మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప కార్యకర్తలతో కలిసి వెళ్తుండగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిరసన కార్యక్రమాలు చేయడానికి అనుమతులు లేవని పోలీసులు కిష్టప్పకు తెలిపారు. దీంతో ఆయన ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, రఘునాథ్‌రెడ్డి, నరేష్, శ్రీనివా సులు, ఎల్ఎన్ నారాయణస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు

ఓబుళదేవరచెరువు : దాడిని నిరసిస్తూ స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. అనంత రం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందనటానికి, ఆటవిక రాజ్యం నడుస్తుందనడానికి ఈ దాడి నిదర్శనం అన్నారు. వైసిపి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇకనైనా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, దాడి చేసిన వైసిపి గూండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, డాక్టర్ జాకీర్ అహ్మద్, హరీష్‌ఖాన్, టిఎన్‌టియుసి నియోజకవర్గ అధ్యక్షులు నిజాం, టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప, జయచంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : దాడిని ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆదేశాల మేరకు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టిడిపి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టి సిఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు అరుణ ఆదినారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో వైసిపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్, రామాంజనేయులు, తాలూకా రైతు అధ్యక్షులు రాజగోపాల్, కిష్టప్ప, చిన్నయ్య, ఈశ్వర్, సాగర్, గంగాధర్, శ్రీనివాసులు, రమేష్, ప్రభాకర్, నరేష్, గోపాల్, గంగాధర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

లేపాక్షి : లేపాక్షిలో టిడిపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి గూండాల రాళ్ల దాడిని ఖండిస్తూ హిందూపురంలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా మండల కన్వీనర్ జయప్ప, నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు.

కదిరి టౌన్ : చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి దాడి సిగ్గు చేటని జిల్లా అధికార ప్రతినిధి వల్లేపు సోమశేఖర్ విమర్శించారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేని పెద్దిరెడ్డి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబు కాన్వాయ్‌పై మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల దాడిని ఖండిస్తూ శనివారం టిడిపి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని కర్నాటక నాగేపల్లి వంతెన సమీపంలో సిఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి పోస్టర్లను దహనం చేసి నిరసన తెలిపారు. సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిరసనకారులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకూ అక్కడే ఉంచారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, బెస్త చలపతి, జిల్లా కార్యదర్శి గూడూరు ఓబులేసు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, నాయకులు మాల మనోహర్, గంగాద్రి, గాజుల రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వేతనాల కోసం ఎపిటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బికె ముత్యాలప్ప మాట్లాడుతూ కనీసం ఆగస్టులోనైనా పెండింగ్ జీతాలు వస్తాయో రావో తెలియక ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. జీఓ 117 వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రవీంద్రారెడ్డి, బలరాముడు, నాయకులు పాల్గొన్నారు.

రొద్దం : ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహశీల్దార్ కార్యాలయంలో డిటి ఖలీల్‌కు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు, ఎంఇఒలకు వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో అధ్యక్షులు మంజుల, ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, మండల అధ్యక్షులు కృష్ణానాయక్, ప్రధాన కార్యదర్శి మల్లి, ఉపాధ్యాయులు గోకుల్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినత పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సూర్యనారాయణరెడ్డి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఫకీర్‌నాయక్, అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్‌కు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జవ్వాజి నాగరాజు, సంజీవరాయుడు, రంగేష్, చంద్ర, కాలయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



రొద్దంలో డిప్యూటీ తహశీల్దార్ ఖలీల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బత్తలపల్లి : ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని నిరసిస్తూ ఎపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నాగరాజు, అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి నాగశేషణ. జిల్లా కౌన్సిలర్లు నాగేశ్వరయ్య, వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు తిమ్మప్ప, నారాయణస్వామి, వెంకటేశ్వర, సునీత, మస్తాన్వలి, కార్యదర్శులు తిప్పేస్వామి, హరికష్ణ, రామసుబ్బారెడ్డి, ప్రమీల, ప్రసాద్, లక్ష్మీనారాయణ. ఆడిట్ కన్వీనర్ రామునాయక్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించాలి

కదిరి టౌన్ : అగ్రి గోల్డ్ బాధితులకు డిపాజిట్లు వెంటనే చెల్లించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ మండల అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ అనంతపురంలోని సిపిఐ కార్యాలయం వద్ద వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ఉమ్మడి అనంతపురం జిల్లాల అగ్రిగోల్డ్ బాధితులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని, నియోజకవర్గ అగ్రిగోల్డ్ బాధితులందరూ తప్పక హాజరవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే రౌండ్ టేబుల్ సమావేశ కరపత్రాలను ఆవిష్కరించి ఏజెంట్లు, డిపాజిటర్లు, అగ్రిగోల్డ్ బాధితులకు అందజేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, ఫక్రుద్దీన్, బాధితులు నౌషాద్, తాహిర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను అణగదొక్కడమే సిఎం జగన్ ధ్యేయం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను అణగదొక్కడమే ధ్యేయంగా సిఎం జగన్ పని చేస్తున్నారని సిపిఐ నాయకులు ఆరోపించారు. చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి అల్లరి మూకల దాడిని శనివారం సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ఏ పార్టీ నాయకుడైనా బహిరంగ సమావేశాలు, ప్రచారాలు చేసు కుని హక్కు ఉందన్నారు. ఇకనైనా అధికార పార్టీ నాయకులు, సిఎం జగన్ నిరంకుశపాలనకు, ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులకు స్వస్తి చెప్పి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, శ్రీరాములు, కె.బాబు, వెంకటనారాయణ, వెంగమునిు, శ్రీరాములు, తుమ్మల చెన్నప్ప, ఈశ్వర్‌నాయక్, వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.